# విశ్వావసు ఉగాది స్వాగతం

ఓ విశ్వావసు ఉగాది
అగాధాల తగాదాలు దాటి
విషాదాల విధ్వంసాలు దాటి
హరివిల్లుల జల్లులతో
ఆనంద గంధ సుమశోభితమై
అందంగా అందరి మదిలో విరబూసిన
విశ్వావసు ఉగాది
నీకు కోటి ఆశలతో శతకోటి
శుభాభినందనలు..!

ఓ విశ్వావసు ఉగాది
ప్రకృతి పలకరింపుల
పులకరింపులతో
స్వచ్ఛమైన పచ్చని పసిడి కాంతులతో
స్వర్ణాంధ్ర ధాత్రి కి
నీ ఆగమనం
నవ్యాంధ్రోదయగీతమై
విన్నూత్న
విశ్వావసు రాగమై
మా మానస వీణ పై
సమీర స్వర నాదమైంది..

ఓ విశ్వావసు ఉగాది
కష్టజీవుల కళ్ళల్లో శాంతి క్రాంతి
వెలుతురుతో
సౌభాగ్య శోభితమై ప్రకాశిస్తావో
అభాగ్యుల పాలిట ఆక్రందనల తో
ఆకలి కేకలౌతావో...

ఓ విశ్వావసు ఉగాది
సగటు బ్రతుకుల ఇళ్లల్లో సంతస గీతమై
పల్లవిస్తావో
సంకటాల సమ్మెట దరువై
సమస్యల దెబ్బలతో
ప్రమాదగణ జన విషాదగీతమౌతావో
సస్యశ్యామల అవనిలో
సామరస్య సుమసుగంధమౌతావో...!

ఓ విశ్వావసు ఉగాది
విశ్వశాంతికి విన్నూత్న గీతమై
ప్రపంచమంతా పల్లవించు
జగానికంతా జనగణగీతమై
త్రికాలాలలో త్రివర్ణ పతాకమై
ప్రకాశించు...!



G n l g కాత్యాయని
తెలుగు లెక్చరర్
శ్రీ దుర్గా మల్లేశ్వర మహిళా కళాశాల
విజయవాడ